ప్రజాశక్తి
ఆదివారం 4 మే 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

'నీట్' పరీక్షకు సర్వం సిద్ధం

- ఐదు పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్షకు హాజరు కానున్న 1473 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశవ్యాప్తంగా నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కంఎంట్రన్స్ టెస్ట్) ఆదివారం జరగనుంది. ఈ పరీక్ష కోసం అధికార యంత్రాంగం జిల్లా కేంద్రమైన ఒంగోలులో అన్ని ఏర్పాట్లు చేసింది. ఒంగోలులోని ఐదు కేంద్రాలలో జరిగే ఈ పరీక్షను 1,473 మంది అభ్యర్థులు రానున్నారు. నీట్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా శనివారం పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై అధి.కారులకు పలు సూచనలు చేశారు.

నీట్ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరగనుంది. ఈ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేశారు. ఒంగోలులోని ▶ 2లో

నామినేటెడ్ పదవులపై

ఏకాభిప్రాయం కరువు

- కీలక పోస్టులకు చైర్మన్ల నియామకం ప్రశ్నార్థకం
- కొండపి, ఒంగోలు ఎంఎంసిలపై కొనసాగుతున్న సందిగ్ధం
- పిడిసిసి బ్యాంకు రేసులో ప్రముఖ వైద్యుడు సీతారామయ్య



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

జిల్లాలో నామినేటెడ్ పదవుల ఎంపిక ప్రక్రియ ఇంకా కొలిక్కిరాలేదు. తర్జన భర్జనలు నడుస్తున్నాయి. ఎవరికి ఇస్తే ఎలా ఉంటుందనే దానిపై మీమాంస నడుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు గడిచినా ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. కారణం నేతల మధ్య ఏకాభిప్రాయం లేనందునే అన్న చర్చ సాగుతోంది. ఆశావహులు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నందున కీలక పదవుల విషయం పక్కనబెట్టారు. దీంతో ఆయా సంస్థలకు పాలకవర్గాలు లేక వాటిల్లో కార్యకలాపాలు, ప్రజలకు అందాల్సిన ఫలాలు కూడా ప్రశ్నార్థకంగా మారాయి. గతంలో ప్రకటించిన కొన్ని పదవులకు కీలక నేతలను ఎంపిక చేశారు. నియోజకవర్గాల్లో ద్వితీయశ్రేణి గణం కోసం ఏమీ జరగలేదు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం బోర్డు ఛైర్మన్‌గా నూకసాని బాలాజీని నియమించారు. పార్టీకి రాష్ట్రస్థాయిలో సేవలం దించిన ఇద్దరు ముగ్గురికి పదవులు దక్కాయి. ఇక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల గెలుపులో కీలకపాత్ర పోషించిన నేతలకు ఇచ్చే పదవులపై ఏ నిర్ణయం తీసుకోలేపోతున్నారు. మార్కెట్ కమిటీలు కొన్ని ప్రకటించారు. ఒంగోలు, కొండపి మార్కెట్ కమిటీలకు ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై ఏకాభిప్రాయం రాలేదు. వాటికోసం చాలా మంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు. పిడిసిసి బ్యాంకు చైర్మన్‌గా ప్రముఖ వైద్యులు సీతారామయ్య రేసులో ఉన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆయనకే సిఫార్సు చేశారు. ముందు త్రిమెన్ కమిటీని ఏర్పాటు చేయాలి.అందులో ఒకరిని చైర్మన్‌గా ప్రకటిస్తారు. ఈ నెలాఖరులో జరిగే పార్టీ మహానాడు లోపు అన్ని నామినేటెడ్ ▶ 2లో

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి- మర్రిపూడి

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. మర్రిపూడిలో రెవెన్యూ సమస్యలపై శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల నుంచి అర్జెంట్ స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందని విమర్శించారు. శుక్రవారం అమరావతి పున : ప్రారంభం సభకు వచ్చిన జన సందోహం చూసి వైసిపి నేతలకు కళ్ళు బైర్లు కమ్మాయన్నారు. రూ.49 వేల కోట్ల పనులతో అమరావతికి పునరుజ్జీవం పోస్తున్నామని ▶ 2లో

పొగాకు కొనుగోలుకు కంట్రోల్ రూం ఏర్పాటు ▶ 5లో

ట్యాంకర్లు కాదు.. శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాల పట్టణంలోని సుందరయ్య కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలకు తాత్కాలిక ట్యాంకర్లు కాకుండా శాశ్వత నీటి పరిష్కారం చూపాలని సిసిఎం జిల్లా నాయకులు డి సోమయ్య తెలిపారు. శనివారం సిసిఎం ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీల వాసులతో కలిసి స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ మూడు రోజులు నుంచి ట్యాంకర్లను కూడా నిలిపివేశారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీంతో కాలనీ వాసులను దృష్టిలో పెట్టుకొని శాశ్వత నీటి పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.



నీటి కోసం ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా శివ కోటేశ్వరరావు మాట్లాడుతూ వారంలోగా సుందరయ్య కాలనీకి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దావీదు, యాకోబు, ఏసుబాబుతో పాటు సుందరయ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులపై ఏకాభిప్రాయం కరువు

(మొదటిపేజీ తరువాయి)

పదవుల భర్తీ ఉంటుందని భావిస్తున్నారు. ఒడా ఛైర్మన్ పోస్టుపైనే అందరి దృష్టి ఉంది. ఒంగోలు పట్టణంలో చాలా మంది ఆశిస్తున్నారు. ఎమ్మెల్యే జనార్ధన్ ఈ పోస్టును జనసేన నేత రియాజ్‌కు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు చర్చ ఉంది. జనసేనకు కేటాయించే విషయం గానీ, ఒకవేళ ఆపార్టీకి కేటాయించాల్సి వస్తే ఎవరికి ఇవ్వాలనేదీ ఆపార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయంగా ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై సందిగ్ధం కొనసాగుతోంది. తెలుగుదేశం నుంచి పలువురు సీనియర్ నేతలు ఆశిస్తున్నారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, పశుసంవర్ధకశాఖపరిధిలోని ఆల్డా ఛైర్మన్, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య ఛైర్మన్, డైరెక్టర్లు, జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డిసిఎంఎస్) ఛైర్మన్ల పోస్టులు భర్తీ కాలేదు. జిల్లా డెయిరీని పునరుద్ధరిస్తే దాని పాలకమండలికి ఛైర్మన్‌తోపాటు డైరెక్టర్లను భర్తీ చేయాల్సి ఉంది. డెయిరీ ఉన్నంత కాలం దీని పాలకవర్గం చాలా ప్రాధాన్యత ఉంది. మూతపడటంతో దాని పదవులు కూడా పోయాయి. ఇక పదవులు ఆశించే నేతలు ఎంపీలు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ వారి కటాక్షం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజాప్రతినిధుల సిపార్సులే కీలకంగా ఉన్నాయి. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఎంపిక చేసిన వారికే ఎంసిలు దక్కుతాయి. జిల్లా స్థాయి ఛైర్మన్లకు అందరి మద్దతు కావాలి.దీంతో సిఫార్సులేఖలు కోసం తిరుగుతున్నారు. ఇప్పటికే ఆశీస్సులు పొందిన నేతలకు పదవులు రావడం ఖాయంగా భావిస్తున్నారు. ఎన్నికల్లో ఓటమి పాలైన దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, వైపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు కూడా అధికారిక సమావేశాల్లో పాల్గొనేలా ప్రోటోకాల్ పదవులు ఆశిస్తున్నారు. ఇలా అందరూ పదవులపై ఆశల్లో ఉన్నారు. భర్తీ కోసం ప్రజా ప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం లేకనే జాప్యం జరుగుతోందన్న చర్చ సాగుతోంది.

'నీట్' పరీక్షకు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. ఒంగోలులోని డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్, జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయ, దామచర్ల ఆంజనేయులు, సక్కుభాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు చేశారు. వేసవిని దృష్టిని ఉంచుకొని అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నిరంతర విద్యుత్, మంచినీళ్ళు, మౌలిక వసతులతో పాటు ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

నీట్ 2025 పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరగనుంది. అభ్యర్థులు 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సెంటర్లకు వెళ్ళేందుకు అనుమతిస్తారు. అడ్మిట్ కార్డుతో పాటు గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తప్పనిసరిగా తీసుకెళ్లాలి. ఫోన్, వాచ్‌లు, బ్లూటూత్, బంగారు, వెండి ఆభరణాలు, పెన్నులు, ప్యాడ్స్, పౌచ్‌లు వంటి వస్తువులకు పరీక్షా కేంద్రంలోని అనుమతి లేదు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు కోరుతున్నారు.

పరీక్షా కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్

నీట్ పరీక్షా కేంద్రాలను కలెక్టరు తమీమ్ అన్సారియా శనివారం పరిశీలించారు. డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్, జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయ, దామచర్ల ఆంజనేయులు, సక్కుభాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల్లో నీట్ పరీక్షా ఏర్పాటు చేశారు ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను కలెక్టర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలులోని 5 సెంటర్లలో 1,473 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రతి సెంటరుకు రెవెన్యూ, పోలీసు శాఖల తరపున ప్రత్యేక నోడల్ అధికారులను నియమించామన్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి బి. చినఓబులేసు, పరీక్షల నిర్వహణ సిటీ కో-ఆర్డినేటర్ మనీష్, ఇతర అధికారులు ఉన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయులనే నియమించాలి

ప్రజాశక్తి-మార్కాపురం

ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయులనే నియమించాలని శనివారం మార్కాపురం విచ్చేసిన ఎమ్మెల్సీ, రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఎంఎ షరీఫ్‌ను రాష్ట్ర ఉర్దూ ఉపాధ్యాయ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న రేషనలైజేషన్ ప్రక్రియలో ఉర్దూ ఉపాధ్యాయులు, ఉర్దూ స్కూళ్ల సమస్యలపై విన్నవించుకున్నారు. ఉర్దూ మీడియం పాఠశాలల్లో కేవలం ఉర్దూ ఉపాధ్యాయులే ఉండాలని కోరారు. ఉర్దూ మీడియం స్కూళ్లలో తెలుగు ఎస్జీటీ అవసరం లేదన్నారు. ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలల్లో కూడా ఉర్దూ ఎస్‌జిటిని మాత్రమే కొనసాగించాలని కోరారు. 6,7,8 తరగతుల కోసం ఉర్దూ మీడియం స్కూల్ అసిస్టెంట్స్‌ను నియమించాలి. ఉర్దూ సెక్షన్ లాంగ్వేజ్ పోస్టులు యథావిధిగా కొనసాగించాలని అన్నారు. ఇంగ్లీష్ మీడియం హైస్కూల్స్‌లో ఉర్దూ ఎస్‌ఎ పోస్టులు కొన్ని చోట్ల మిగులుగా చూపించారని, ఉర్దూ ఎస్‌ఎ పోస్టులు యథావిధిగా కొనసాగాలని అన్నారు. ఉర్దూ స్కూళ్లు, ఉర్దూ పోస్టులకు సంబంధించిన క్యాడర్ స్ట్రెంత్ ఏర్పాటు చేయడంలో ఉర్దూ డిఐ సహకారంతో, వారి సలహాలు సూచనలతో ముందుకు సాగాలన్నారు. ప్రకాశం జిల్లాలోని ఉర్దూ పోస్టులు రేషనలైజేషన్‌లో తొలగిపోకుండా సర్‌ప్లస్ నుంచి ఉర్దూ పోస్టులను కాపాడాలని కోరారు. పై సమస్యలన్నింటిపై ఎంఎ షరీఫ్ సానుకూలంగా స్పందించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూట జిల్లా అధ్యక్షులు షేక్ అన్వర్ బాషా, అష్రాఫ్ అలి, ఉర్దూ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు పి వహీద్ ఖాన్ పాల్గొని వినతిపత్రం సమర్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ప్రధాని మోదీ సహకారం సిఎం చంద్రబాబు విజన్‌తో ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చేలా అమరావతిని తీర్చిదిద్దుతామన్నారు. అధికారం ఉన్నప్పుడు అవినీతికి పాల్పడిన జగన్ నేడు రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చుతున్నారని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్నదాతలకు చంద్రబాబు నాయుడు అన్ని విధాలా అండగా ఉన్నారన్నారు. అనంతరం రైతులకు యంత్ర పరికరాలు, స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరు మార్పు / సవరణ

నేను మెట్ల శ్రీనివాసులు S/o మెట్ల గురవయ్య, నివాసం : 1-93, చెట్టిచెర్ల, చెట్టిచెర్లగ్రామం, బేస్తవారిపేట మండలం, పూసలపాడు, ప్రకాశంజిల్లా - 523334.

నా యొక్క కుమారుడు ఆధార్‌కార్డులో తండ్రిగారి పేరు రెండుసార్లు నమోదు కాబడినది. నా కుమారుడి పేరు మెట్ల గురు పవన్ అని నమోదు కాబడలేదు. ఇప్పుడు ఆధార్‌లో మెట్ల గురుపవన్ S/o మెట్ల శ్రీనివాసులు **(METLA GURUPAVAN S/O METLA SRINIVASULU)** అని నమోదు కావలెను.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం బైటమంజులూరు గ్రామ కాపురస్తురాలు సరికొండ పూర్ణంజనేయరాజు గారి భార్య సరికొండ సునీత. ప్రస్తుతం నా భర్తగారైన సరికొండ పూర్ణంజనేయరాజు గారు మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఉద్యోగరీత్యా మార్టూరులో నివాసం ఉంటున్నాము. నా తండ్రి గారైన ప్రతి కంఠం సీతంరాజు కుమారుడు హరినాధరాజు గారి తాలూకు గుంటూరుజిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామం సర్వేనెంబర్ 394రులో ప్లాట్ నెంబర్ 17రులో చ.గ.205లను వెనిగండ్ల గ్రామ కాపురస్తుడు ఆత్మకూరి వెంకట రెడ్డి గారి కుమారుడు రవీంద్రారెడ్డి వగైరాల వల్ల విక్రయం పొంది శ్రీపెద్దకాకాని సబ్‌రిజిస్టర్ వారి కార్యాలయంలో 1వ పుస్తకం113 వాల్యూం 31ల 36 పుటలలో దస్తావేజు నెం1814/1998 రుగా విక్రయం పొందిన ఒరిజినల్ దస్తావేజును నేను నివాసం ఉంటున్న మార్టూరు గ్రామంలోని గృహం నుండి జిరాక్స్ నిమిత్తం మార్టూరు సెంటర్‌కు వచ్చే క్రమంలో దస్తావేజు నెం:1814/1998రు ఒరిజినల్ దస్తావేజు పోయినది. కావున దొరికినవారు క్రింది ఫోన్ నెంబర్‌కు తెలియ పరచగలరు.

ఇట్లు
సరికొండ సునీత
భర్త సరికొండ పూర్ణంజనేయ రాజు
మార్టూరు గ్రామం, మార్టూరు మండలం,
బాపట్ల జిల్లా
మొబైల్ నెం :9440903888

మహారాజశ్రీ గౌరవనీయులైన 3 వ ఆదనపు జిల్లా జడ్జి కం మోటార్ వెహికల్స్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ :: కర్నూలు AT నంద్యాల

MVOP NO.359/2015

వేల్పుల కాసేమ్మ ....పిటిషనర్స్

V/S

పఠాన్ మహబూబ్ శరీఫ్ & ఇతరులు ..ప్రతివాదులు

5వ రెస్పాండంట్ :
వేల్పుల వెంకట శివరామిరెడ్డి తండ్రి బాల చెన్నారెడ్డిజి

7వ రెస్పాండంట్ :
వేల్పుల వెంకట్రామిరెడ్డి తండ్రి బాల చెన్నారెడ్డి
పై ఇద్దరి అడ్రస్ : తిమ్మాపురం గ్రామం గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

R5 & R7 ప్రతివాదులకు నోటీసు

పైన కనబర్చిన అర్జీదారులు, తన భర్త యాక్సిడెంట్లో చనిపోయినందున నష్టపరిహారం కోరకు దాఖలుచేసిన పై నెంబర్ అర్జీ నందు 5&7వ రెస్పాడెంట్స్ అయిన మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టు నందు 08/05/2025 వ తేదిన మీరు గాని మీ తరఫువకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేనియెడల, మీ పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తరువుల మేరకు)

వాయిదా తేదీ : 08/05/2025

ఇట్లు
టి. మహమ్మద్ రఫీ
పిటిషనర్ తరపు న్యాయవాది
నంద్యాల : 9440079812

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఏ.నెంబర్:1139/2022

ఇన్

ఓ.ఎస్.215/2022

కొణతం నాగార్జున వగైరాలు ... పిషనర్లు/వాదులు

వర్సెస్

కొణతం గంగిరెడ్డి మరియు వగైరాలు
... రెస్పాండెంట్స్ /ప్రతివాదులు

To,

R10/D10) అలికేపల్లి ఆదిలక్ష్మి భర్త ఆదిరెడ్డి, తండ్రి వెంకట రెడ్డి, వయసు 36సం, హిందూ, గృహిణి

R11/D11) అలికేపల్లి రమాదేవి భర్త శ్రీను, @ చిన్న, తండ్రి వెంకట రెడ్డి, వయసు34 సం, హిందూ, గృహిణి, ఇరువురి నివాసం : మద్దులూరు గ్రామం, కొండపి మండలం, ప్రకాశం జిల్లా.

దావా సమను

పై నెంబర్ దావా తేదీ : 13-05-2025దిన మీ నోటీసు కొరకు వాయిదా ఉన్నది. కావున పై నెంబరు దావా యందు మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యడల తే:13-05-2025దిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తరువుల మేరకు //

వాయిదా తేదీ : 13-05-2025 ఇట్లు

ఎస్.ఎం.బాషా,
వాది తరుపు అడ్వకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ :9949435269.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

AS. No. 120/2024

బెజవాడ కోటేశ్వరమ్మ
Rep by GPA Holder,
బెజవాడ వెంకట సురేష్‌బాబు ......Appellant

Vs

కొత్తపల్లి గోవిందమ్మ మరియు ఇంకొందరు
.......Respondents

To.

(3వ రెస్పాండెంట్) కొత్తపల్లి రామరావు, S/o. కోటేశ్వరరావు, R/o జమ్ములపాలెం గ్రామం, టంగుటూరు మండలం,ప్రకాశం జిల్లా,

పై నంబరు అప్పీలులో నీవు3వ రెస్పాండెంట్ అయిఉన్నారు. మీకు నోటీసు నిమిత్తము ఎన్ని సార్లు నోటీసు పంపిననూ నోటీసు చేరనందున శ్రీ కోర్టు వారు ప్రజాశక్తి పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ఈ ప్రకటన చూసిన తరువాత తేది. 25-06-2025న ఉదయం 10.30లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగాగాని, లేదా మీ యొక్క అడ్వకేటు ద్వారా గాని హాజరై మీ యొక్క సమాధానం తెలుపుకొనవలసినది, లేని యెడల పై తెలిపిన అప్పీలు మీకు పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
పంగులూరి గోవిందయ్య,
అడ్వకేట్, ఒంగోలు.


ఏఎంసీ చైర్మన్‌ను అభినందిస్తున్న వైద్యులు

ఎఎంసి చైర్మన్‌ను అభినందించిన సంఘమిత్ర వైద్యులు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీటీసీ డాక్టర్ ఇమామ్ సాను అస్టర్ రమేష్ సంఘమిత్ర కార్డియాలజిస్ట్ డాక్టర్ సందీప్ శనివారం కలిసి అభినందనలు తెలిపారు. ప్రకాశం జిల్లాలో ప్రత్యేకమైన స్థానం ఏర్పరచుకున్న ఆర్‌ఎంపీ వైద్యులు డాక్టర్ ఇమాంసా రాజకీయాల్లో కూడా తన ప్రత్యేకత చాటుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇమాంసా మాట్లాడుతూ ఏఎంసీ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా కందుల నారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రతి రైతుకి నేను న్యాయం చేస్తానని, అలాగే తన వృత్తి ప్రతి ఒక్కరికి వైద్యం అందిస్తానని తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి

ఎట్టకేలకు వీడిన ఐశ్వర్య అదృశ్యం మిస్టరీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ పంచా యతీ పరిధిలోని బాలిరెడ్డి నగర్ లో ఈనెల 1న అదృశ్యమైన మూడేళ్ల చిన్నారి ఐశ్వర్య ఎట్టకే లకు తల్లిదండ్రుల వద్దకు చేరింది. బాలిరెడ్డినగర్‌కు చెందిన చిలకూరి హరికృష్ణ కుమార్తె ఐశ్వర్య అదృశ్యం కావడంతో తల్లి దండ్రులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్‌పి ఎఆర్. దామోదర్ ఆదేశాల మేరకు ఒం గోలు డిఎస్‌పి రాయపాటి. శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో శింగరాయకొండ సిఊ హాజరత్తయ్య, ఎస్ఐ బి.మహేంద్ర, పోలీసు సిబ్బందితో మూ డు బృందాలు ఏర్పడి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయో గిస్తూ శింగరాయకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ని సిసి కెమెరాల ఫుటేజీని పరిశీలించి ఐశ్వర్యను ఎవరూ తీసుకెళ్లారో, ఎటు వైపు తీసుకెళ్లారనే విషయాలను గుర్తించారు. పాప ఫొటోను అన్ని వాట్సప్ గ్రూపులు, అన్ని విలేజ్ వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేశాడు. కరపత్రాలు పంచారు. సోషల్ మీడియాలో పాప ఫొటోను గుర్తించిన నెల్లూరు జిల్లా, వలేటివారిపాలెం మండల పరిధిలోని అంకభూపాలపురం గ్రామానికి వ్యక్తి ఓ వ్యక్తి పాప తమ గ్రామంలో ఉన్నట్లుగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అంగభూపాలపురం వెళ్లి పాపను తీసుకొచ్చి ఎస్‌పి దామోదర్ సంక్షమంలో తల్లిదండ్రులకు అప్పగించారు. పాపను తీసుకెళ్లిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అదృశ్యమైన చిన్నారి ఆచూకీ కనిపెట్టడంలో అత్యంతప్రతిభ కనపరిచిన శింగరాయకొండ సిఐ సిహెచ్.హాజరత్తయ్య, ఎస్ఐ బి.మహేంద్ర, పోలీసు సిబ్బంది, జి.రమేష్, డి.తిరుపతిస్వామి, సిహెచ్.చిన్న, ఎస్.సుమన్, ఖాజా చంద్రశేఖర్ ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.



తల్లిదండ్రులకు పాపను అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ దామోదర్

నేరాల కట్టడికి డ్రోన్లతో నిఘా : ఎస్‌పి

మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు డ్రోన్ బహూకరించిన గోరంట్ల రవికుమార్

ప్రజాశక్తి-మద్దిపాడు

డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. హర్షిని కాలేజీ చైర్మన్ గోరంట్ల రవికుమార్ పోలీస్ శాఖకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఒక డ్రోన్‌ను బహుకరించగా శనివారం ఎస్పీ దామోదర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం నేరాల నియంత్రణలో, శాంతిభద్రతల పరిరక్షణలో, అత్యవసర పరిస్థితులలో డ్రోన్ కెమెరా ఉపయోగపడుతుం దన్నారు. కెమెరా అధిక రిజల్యూషన్ కలిగిన చిత్రాలు, వీడి యోలను తీయగలదని దీని ద్వారా విస్తృతమైన ప్రాం తాలను నిఘా ఉంచడానికి నేర స్థలాలను పరిశీలించడానికి, ట్రాఫిక్‌లో పర్యవేక్షించడానికి వీలవుతుం దన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు జరిగే ప్రాంతాలు, ఇతర నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ ఒక డ్రోన్లను పంపి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. వివిఐపీలు, విఐపిల బందోబస్తులను ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా డ్రోన్ కెమెరాల సహాయంతో పర్యవేక్షిస్తున్నామన్నారు. ముఖ్య కూడళ్ళల్లో ట్రాఫిక్ నియంత్రణ, సుదూర ప్రాంతాలు ఉన్న వ్యక్తులపై మెగా పెట్టేందుకు వీటిని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి దోహదపడుతుందన్నారు. పోలీస్ శాఖకు డ్రోన్ ను బహుకరించిన గోరంట్ల రవికుమారును ఎస్పీ అభినందించారు. అనంతరం ఆ డ్రోన్‌ను మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సీఐ ఎన్ శ్రీకాంత్ బాబు, ఎస్సై శివరామయ్య, సిబ్బంది ఉన్నారు.


డ్రోన్ కెమెరాను అందజేస్తున్న ఎస్పీ దామోదర్, గోరంట్ల రవికుమార్

వన్య ప్రాణుల దాహం తీర్చేందుకూ..

నల్లమల అడవుల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పులులు సంరక్షణ ప్రాంతంగా ప్రత్యేక గుర్తింపు పొందిన నల్లమల అటవీ ప్రాంతంలో ప్రస్తుతం గతంలో ఎన్నడు లేని గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అటవీ జంతువులకు నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. పులుల మినహా, ఇతర జంతువులు అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాలు, తం డాల వైపు అడపాదడపా కనిపిస్తూనే ఉన్నాయి. ప్రకాశం, గుంటూరు, కర్నూలు, తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించింది. ఇందులో 58 చదరపు కిలోమీటర్ల పరిధిలో గంజివారిపల్లి రేంజి విస్తరించి ఉంది. ప్రస్తుతం గంజి వారిపల్లి రేంజి అటవీ ప్రాంతంలో 16 పులులు, 15 చిరుతపులులు సంచరిస్తున్నట్లు గణాంకాల్లో వెల్లడైంది. ప్రస్తుతం నీటి కష్టాలు నేపథ్యంలో అటవీ శాఖ వన్యప్రాణి విభాగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. వారానికి ఒకరోజు ట్యాంకర్ల సాయంతో నీటిని తరలిస్తున్నారు.

నల్లమలలో కృష్ణానది ప్రవహిస్తున్నా..

నల్లమల అటవీ ప్రాంతం మధ్య గుండా కృష్ణానది ప్రవహిస్తుంది. అయితే నీటి మట్టాలు ఇందులోనూ అడుగంటాయి. అటవీ ప్రాంతంలో వాగులు, చెరువుల్లో నీళ్ల అడుగంటిపోయాయి. అక్కడక్కడ మాత్రం లోతట్టు ప్రాంతాలలో సెలయేటి ధ్వారా నీటి చేరిక ఉంటుంది. ఇటువంటి ప్రాంతానికి పెద్ద పులులు వెళ్తున్నాయి. ఇక్కడకు దుప్పులు, జింకలు, ఇతర అటవీ జంతువులు వెళ్లేందుకు భయపడుతుంటాయి. పులులు దాడులు చేస్తాయనే భయంతో అవి అటవీ ప్రాంతాలకు సమీపంలోని పొలాల వైపు వెళ్తున్నాయి. అటవీ ప్రాంతంలో నీటి వనరులుంటే, అక్కడకు వచ్చి తాగి వెళ్తుంటాయి. పశుగ్రాసం మీద ఆధారపడే జంతువులు మాత్రం నీటి వనరుల కోసం నిత్యం సంచరిస్తుంటాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రత 39 నుండి 40 డిగ్రీలు దాటుతోంది. దీంతో వేడిగాలులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు జంతువులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనిపైనే అటవీ శాఖ వన్యప్రాణి విభాగం దృష్టి సారించింది.

జంతువుల సంరక్షణకు ప్రత్యేక దృష్టి..

మండుతున్న ఎండల నేపథ్యంలో అధికారులు అటవీ ప్రాంతంలోని జంతువుల సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారిం చారు. ఇందుకోసం నీటి అవసరాలను తీర్చేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. అటవీ ప్రాంతంలో కొన్నిచోట్ల బేస్ క్యాంపులు గుర్తించారు. ఇక్కడ లోతట్టు ప్రాంతాలలో కుంటలు తవ్వారు. ఇందులో ట్యాంకర్ల సాయంతో నీటిని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్తున్నారు. ఈ నీటిని లోతట్టు ప్రాంతాలలోని కుంటలలో నింపుతున్నారు. వారానికి సరిపడ్డా నీటిని ఇక్కడ నిల్వ చేస్తారు. రాత్రులు దుప్పులు, జింకలు, ఇతర జంతువులు వస్తు న్నట్లు గుర్తించారు. పులులు మాత్రం దూరం గా ఉంటున్నాయి. అవకాశం ఉన్నచోట అవి వెళ్లి తాగుతున్నాయి. గంజివారిపల్లి రేంజ్ పరిధిలోని నెక్కంటిలో నాలుగు, పాలుట్లలో నాలుగు, గంజివారిపల్లిలో నాలుగు, భూరు గండాల పరిధిలో రెండు చొప్పున సాసర్‌పిట్లు ఏర్పాట్లు చేశారు. ట్యాంకర్ సహాయంతో వాటిలో నీటిని నింపుతున్నారు. జంతు సంరక్షణ కోసం నీటిని నిల్వ చేయనున్నారు.


నీరు తాగుతున్న వన్యప్రాణులు


నీళ్ళు నింపుతున్న సిబ్బంది

నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

ఎస్‌వి సుబ్బారావు, గంజివారిపల్లి రేంజర్, యర్రగొండపాలెం

దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలోని నెక్కంటి, పాలుట్ల, గుట్టలచేను, బూరుగుండాల తదితర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా 58 చోట్ల నీటి చెలమలు ఉన్నాయి. అక్కడ నీరు ఊరుతోంది. ఆ ప్రాంతానికి వచ్చి అటవీ జంతువులు దప్పిక తీర్చుకొంటున్నాయి. అంతే కాకుండా అటవీ ప్రాంతంలోని మిగతా చోట్ల కూడా నీటి సమస్యలు తలెత్తకుండా 14 చోట్ల సాసర్ పిట్లను ఏర్పాటు చేసి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ట్యాంకర్ల సాయంతో నీటిని తరలిస్తున్నాం. రాకపోకలకు అవకాశం ఉన్న వరకు ట్యాంకర్‌ను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్తున్నాం. ప్రస్తుతం వేటగాళ్ల కదలికలున్నట్లు తమకు సమాచారం లేదు. మా పరంగా పులులు రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వేసవికాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉంటాం.

లారీని ఢీకొన్న బైక్

యువకుడు మృతి

ప్రజాశక్తి-ముండ్లమూరు

ధాన్యం లారీని ద్విచక్రవాహనం ఢీకొట్టిన సంఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన అద్దంకి-దర్శి రోడ్డులో పసుపుగల్లు గ్రామం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పసుపుగల్లు గ్రామం వద్ద దర్శి వెళ్లేందుకు రోడ్డుకు వస్తున్న ధాన్యం లారీని పసుపుగల్లు ఎస్సీ కాలనీ చెందిన వరగాని శరత్(21) ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో శరత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన శరత్‌ను 108 వాహనంలో దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి అక్కడనుండి మెరుగైన చికిత్స కోసం ఒంగోలు అక్కడి నుంచి గుంటూరు ఆసుపత్రికి తరలించారు. గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శరత్ మృతి చెందాడు. ఎస్ఐ హనుమంతరావు గుంటూరు ఆస్పత్రికి వెళ్లి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడు మృతి చెందాడన్న వార్త విన్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు.


వివరాలు సేకరిస్తున్న పోలీసులు


నిరసన తెలియజేస్తున్న దృశ్యం

ఉగ్ర దాడిని ఖండిస్తూ మానవహారం

ప్రజాశక్తి చీమకుర్తి

పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ చీమకుర్తి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ర్యాలీ మరియు మానవహారం కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం రాత్రి స్థానిక మున్సిపల్ కార్యాలయం సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు మున్సిపల్ కమిషనర్ వై రామకృష్ణయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గోపురం రాజ్యలక్ష్మి, కమిషనర్ వై రామకృష్ణయ్యలు ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందిమల్ల గంగాధర్ రావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గొల్లపూడి కోటేశ్వరరావు, గోపురపు చంద్ర, రిటైర్డ్ పెన్షనర్లు, మెప్మా సిబ్బంది ఆలూరి చిరంజీవి, ఆర్పీలు మహిళలు పాల్గొన్నారు.


చెత్త దిబ్బలు తొలగిస్తున్న దృశ్యం

గోగినేనిపాలెంలో చెత్త దిబ్బల తొలగింపు

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ గోగినేనివారి పాలెం గ్రామంలో శనివారం గ్రామ పంచాయతీ అధికారులు చెత్త దెబ్బలు తొలగించారు. సర్పంచి గుంటూరి ఏసోబు ఆధ్వర్యంలో రహదారి వెంట అడ్డంగా ఉన్న చెత్త దిబ్బలను జెసిబితో తొలగించడంతో పాటు కచ్చా కాలువలో పూడికను తీసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యు.శేషగిరి, సిబ్బంది ఉన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందదర్

ప్రజాశక్తి - బాపట్ల

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మికుల చట్టాలకు వ్యతిరేకంగా ఈనెల 20న దేశవ్యాప్తంగా జరిగే జాతీయ సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ కోరారు. కేంద్ర కార్మిక సంఘాల జిల్లా సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సమావేశానికి ఐఎఫ్‌టియు నాయకులు పి ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మజుందార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్త సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని అన్నారు. ఈనెల 7న జిల్లా సదస్సు పట్టణంలోని అంబేద్కర్ భవన్లో జరపనున్నట్లు తెలిపారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శామ్యూల్ మాట్లాడుతూ సమ్మె జయప్రదం కోసం అన్ని మండలాల్లో సదస్సులు జరపాలని అన్నారు. 18, 19తేదీల్లో జిల్లాలో అన్ని మండ ల, పట్టణాల్లో సమ్మె జయప్రదం కోరుతూ మోటార్ సైకిల్ ర్యాలీలు, గేటు మీటింగులు, కార్మికులకు కరపత్రాల పంపిణీ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో సిఐటియు నాయకులు బి తిరుమలరెడ్డి, కె శరత్, ఎఐటియుసి నాయకులు సింగరకొండ, అంగన్వాడీ యూనియన్ నాయకులు పి రేఖ, (సిఐటియు) శ్రీవాణి (ఏఐటీయూసీ) పాల్గొన్నారు.

డాక్టర్ ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారాలు


పురస్కారాలు అందుకున్న దృశ్యం

ప్రజాశక్తి - అద్దంకి

ఫిలాం ట్రోఫిక్ సొసైటీ సౌజన్యంతో పాన్ ఇండియా రాజమహేంద్రవరం నిర్వహణలో డాక్టర్ ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల సందర్భంగా విజయవాడలోని హెూటల్ ఐలాపురం నందు ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ ఎన్టీఆర్ జాతీయ పురస్కారాలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి రాజకీయ, కళ, సాహితి, సాంస్కృతిక, సేవా రంగాల నుండి 26 మందిని ఎంపిక చేసుకొని డాక్టర్ ఎన్టీఆర్ జాతీయ పురస్కారాలు అందజేశారు. అద్దంకి కళా రంగం నుండి నందమూరి కళా పరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, రాజకీయ రంగం నుండి నాగనేని రామకృష్ణ, సేవా రంగం నుండి బదిరుల పాఠశాల ప్రిన్సిపాల్ పెద్దినేని సురేంద్రబాబు ఎంపికై మాజీ డిప్యూటీ స్పీకర్, అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, అక్కడికి విచ్చేసిన అతిథుల చేతుల మీదుగా డాక్టర్ ఎన్టీఆర్ జాతీయ కీర్తి పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు అద్దంకి రాజా, డూండీ రాకేష్, చప్పిడి రాజశేఖర్, కత్తి మండప్రతాప్, నర్సిపల్లి హారిక, కొల్లి రమావతి , రాజశేఖర్, శ్రీనివాసరావు, ప్రసాద్, అనిల్, రమేష్ పాల్గొన్నారు.


బత్తుల బ్రహ్మారెడ్డిని అభినందిస్తున్న వైసిపి నాయకులు

'బత్తుల'కు అభినందనలు

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపి ప్రకాశం జిల్లా పరిశీలికుడిగా బత్తుల బ్రహ్మానందరెడ్డి ఎంపిక కావడం పట్ల ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. యర్రంవారిపాలెంలోని ఆయన స్వగృహంలో పలువురు వైసిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయిలో మంచి అర్హత, సామర్థ్యం ఉన్న నాయకుడని, పార్టీ స్థాపించిన దగ్గర నుంచి వైసీపీకి విధేయుడిగా పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కటారి అప్పారావు, బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోట శ్రీనివాసరావు, మలినేడి జగన్నాథం, లంకా శివ, పంగులూరి నాగేశ్వరావు, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ యద్దనపూడి హరిప్రసాద్, వేణుగోపాల స్వామి దేవస్థానం చైర్మన్ రావువారి ప్రసాద్, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భవనం రాజగోపాలరెడ్డి, నాగిరెడ్డి, కారంచేడు వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ బుల్లిబాబు ఉన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి సుబ్బయ్య

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మెదరమెట్ల

మండలంలోని బొడ్డువానిపాలెం గ్రామంలో తెలుగుదేశం కార్యకర్త బొనిగల అంజయ్య ఆధ్వర్యంలో అద్దంకి వెళ్లే రోడ్డులో చలివేంద్రం సర్పంచి నేరెళ్ల సుబ్బయ్య శనివారం ప్రారంభించారు. ప్రతి ఏటా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. దాతలు ముందుకు వచ్చి మరిన్ని సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కులు అందజేత


సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజాశక్తి - వేమూరు

కొల్లూరు మండలం క్రాప గ్రామానికి చెందిన మునిపల్లి మార్తమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం లెటర్ అఫ్ క్రెడిట్ చికిత్స కోసం సిఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.3 లక్షల విలువైన చెక్కును శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు శనివారం అందజేశారు. ఎంఎల్ఎ రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి పంపగా ఎల్ఓసి రూపంలో రూ.3లక్షలు మంజూరు చేశారు. మంజూరైన మొత్తాన్ని మునిపల్లి మార్తమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. టిడిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేపల్లె : పేదల ఆరోగ్య అవసరాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపి కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.42.50 లక్షల విలువైన చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిది ద్వార వైద్య ఖర్చులకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కుటుంభంలో ఒకరు అనారోగ్యంపాలైతే కుటుంభం మొత్తం కలత చెందుతుందని అన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎన్నికల సందర్భంగా ప్రతి కుటుంబానికి పెద్దకొడుకుగా ఉంటానని ఇచ్చిన హామీని నిలబెట్టుకొంటూ అనారోగ్యానికి గురైన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంతాని మురళీధరరావు, తెనాలి క్రాంతి సుమన్, ముత్తిరెడ్డి నవీన్ శేఖర్ పాల్గొన్నారు.


సహాయనిధి చెక్కు అందజేస్తున్న శివప్రసాద్


విద్యార్థులకు మెమొంటోలు అందిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో మండలంలోని పందిళ్ళపల్లి, వేటపాలెం బాలికోన్నత పాఠశాల, బిబిహెచ్, అక్కయపాలెం, దేశాయిపేట, కొత్తపేట జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) సేవా దృక్పథంతో ఘనంగా మెమొంటో, నగదు ప్రోత్సాహంతో శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించి, పందిళ్లపల్లి జెడ్‌పి హైస్కూలులో చదివి 596 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న సజ్జా దివ్యశ్రీ విద్యార్థుల్లో మణి హారమని కొనియాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు పింజల శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బండి బిక్షాలు బాబు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పాలెపు సురేష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, సీనియర్ నాయకులు గౌరాభత్తుని సూరిబాబు, స్థానిక పాఠశాల హెచ్ఎం వేదాల ఫణి సత్యనారాయణ, పందిళ్ళపల్లి హైస్కూల్ హెచ్ఎం ఎం శేఖరరావు, యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ ఉమ్మిటి వేణుగోపాలరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జ్ ఎం సుధా

ప్రజాశక్తి- చీరాల

కార్మికులు పనిచేసే ప్రదేశంలో అవసరమైన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యం దేనని సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధా అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కెఎస్ఆర్ హ్యాండ్లూమ్స్‌లో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్మికులంతా ఏకతాటిపై వచ్చి హక్కుల కోసం మాత్రమే కాకుండా బాధ్యతలు తెలుసుకొని సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పనిచేసే కార్మికుల్లో స్త్రీ, పురుషులకు సమాన వేతనాలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు కార్మికులకు అందేలా చూడాలని అన్నారు. పేద వారందరూ న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని అన్నారు. తమ సమస్యను ఒక కార్డు ద్వారా తెలిపిన న్యాయ సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌరవ రమేష్, మహిళా ప్రతినిధి స్నేహ, సీనియర్ న్యాయవాది ఎ రామకృష్ణారెడ్డి, కెఎస్ఆర్ సంస్థ ప్రతినిధి శివయ్య పాల్గొన్నారు.


పిహెచ్‌సిలో సాధారణ ప్రసవం చేయించిన డాక్టర్ శ్రీహర్ష

పిహెచ్‌సిలో సాధారణ ప్రసవం

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీహర్ష ఆధ్వర్యంలో స్టాఫ్ నర్స్ డి ధనలక్ష్మి సహకారంతో మార్టూరుకు చెందిన జి చిన్న నాగమణికి సాధారణ ప్రసవం శనివారం చేశారు. ఆమె ఆడబిడ్డకు జన్మ నిచ్చారు. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య నందు ఆషా వర్కర్ లేదా ఎఎన్ఎం ద్వారా గర్భిణీ స్త్రీ నమోదు చేసుకున్నప్పటి నుండి గర్భిణీ స్త్రీకి అన్ని టీకాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రసవ సమయంలో ఆరోగ్య కేంద్రానికి వస్తే వీలైనంత వరకు సాధారణ ప్రసవం చేయనున్నట్లు తెలిపారు. పుట్టిన వెంటనే బిడ్డకు తగిన టీకాలు, పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తల్లికి రూ.వెయ్యి పారితోషకం ఇవ్వనున్నట్లు తెలిపారు.

మేలో ఆధార్ క్యాంపుల వివరాలు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలో ఆధార్ క్యాంపుల షెడ్యూల్‌ను ఎంపిడిఒ బి సింగయ్య విడుదల చేశారు. మే 5 నుండి 8వరకు మోదేపల్లి, దేనువకొండ సచివాలయాల్లో 5న కుంకుబాడు, కొటికలపూడి, 6న నాగులపాడు, తిమ్మాయపాలెం, 7న వెంకటాపురం, వేలమూరిపాడు, 8న బొమ్మనంపాడు, మణికేశ్వరం గ్రామాలకు సంబంధించిన ప్రజల ఆధార్ కార్డుల్లో సవరణలు చేసుకోవచ్చని అన్నారు. 12న జార్లపాలెం, సింగరకొండపాలెం, 13న చక్రాయపాలెం, కలవకూరు, 14న వెంపరాల, శంఖవరప్పాడు, 15న ఉప్పలపాడు, ధర్మవరం గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డులలో పేర్లు, అడ్రస్‌లు, ఫోను నెంబర్లు సవరణ చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఉపాధి' పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించను

- ఫారం పాండ్స్ పనులు వేగవంతం చేయాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉపాధిహామీ పనుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించబోనని కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఎంపిడిఒలు, ఎపిఒలు వీటికి సంయుక్తంగా జవాబుదారీ అని, లక్ష్యం మేరకు పనులు జరగకపోతే ఇద్దరిపై చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. ప్రకాశం భవనంలో సంబంధిత అధికారు లతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ పథకం ద్వారా జిల్లాలో నిర్వహిస్తున్న పనులు, వాటి పురోగతిని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జోసఫ్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు. ఫారం పాండ్స్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు మే నెలను 'ఫారం పాండ్స్ మాసం'గా ప్రభుత్వం నిర్ణ యించినట్లు తెలిపారు. కలెక్టరు స్పందిస్తూ



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఫారం పాండ్స్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పశ్చిమ ప్రాంతంలో, ముఖ్యంగా యర్రగొండపాలెం నియోజక వర్గంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. మూగజీవుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్ల నిర్మాణాలను కూడా సత్వరమే పూర్తి చేయాలన్నారు. వాస్తవ గడువు గత నెలలోనే ముగిసినప్పటికీ ఇంకా వీటిని పూర్తి చేయకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎంపిడిఒలు, ఎపిఒలు ఈ విషయాన్ని జోక్ గా తీసుకుంటున్నారా? లక్ష్యం మేరకు ఎందుకు పూర్తి చేయడం లేదు? క్షేత్ర స్థాయిలో సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అలా కాకుండా ఏదో ఒక సమాధానం చెప్పి తప్పించుకుం దామనుకుంటే ఊరుకోనని కలెక్టరు హెచ్చరించారు. ఎంపిడిఒలు, ఉపిఒల పనితీరును తాను నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి కోరిన అందరికి పని కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్ నిర్మాణ పనులు కూడా వేగవంతంయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఎపిడిలు, ఎంపిడిఒలు, ఎపిఒలు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఉంది

- కొత్త అభ్యర్థిని మీరే నిర్ణయించండి
- టిడిపి కౌన్సిలర్లకు

చీరాల ఎమ్మెల్యే కొండయ్య సూచన

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అవిశ్వాస తీర్మానం ఎదురోవ్కాల్సి వస్తుందని చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు వైసిపి నుంచి టిడిపి చేరిన విషయం తెలిసిందే. దీంతో కంగుతిన్న టిడిపి కౌన్సిలర్లు క్యాంపు నుంచి రాగానేపై అవిశ్వాస విషయమై ఓ కౌన్సిలర్ ఇంట్లో భేటీ అయ్యారు. స్థానిక ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య, టిడిపి పెద్దల సమక్షంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు టిడిపి కండువా కప్పుకున్న క్రమంలో ఆయన్నే చైర్మన్‌గా కొనసాగే అవకాశం ఉంటుందని వారు భావించారు. అందులో భాగం గానే అంతర్గత సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్య మద్దతు తమకు ఉంటుందా లేక చైర్మన్ జంజనం వైపు మొగ్గు చూపుతారా అనివారు తర్జనభర్జన పడ్డారు. చైర్మన్‌ను దింపడమే ధ్యేయంగా పెట్టుకున్న ఒకరిద్దరూ కౌన్సిలర్లు జరిగిన పరిణామాల విషయమై అవేశ పడినట్లు తెలిసింది. తక్షణమే ఎమ్మెల్యేను కలిసి ఈ విషయంపై అమీతుమీ తేల్చుకోవాలన్న అభిప్రాయానికి వచ్చారు. జాప్యం జరిగితే పరిస్థితి చేతులు దాటి పోతుందని ఎమ్మెల్యేను వెంటనే కలవాలని నిర్ణయించుకున్నారు. హుటాహుటిన విజయవాడ వెళ్ళి ఎమ్మెల్యేకు చెందిన ఇంజినీరింగ్



చీరాల మున్సిపల్ కార్యాలయం

కళాశాలలో ఆయనతో భేటీ అయ్యారు.చైర్మన్ టిడిపిలో చేరిక విషయంలో తమకు ఉన్న అనుమానాలు, అవిశ్వాస తీర్మానంపై జరగాల్సిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశం, ఓటింగ్ విషయాల గురించి ఎమ్మెల్యేతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వేకువజాము వరకూ సుధీర్ఘంగా చర్చించారు. కౌన్సిలర్లు చెప్పిన విషయాలను విన్న ఎమ్మెల్యే కొండయ్య వారి సందేహాలు అన్నిటిని నివృత్తి చేశారు. చైర్మన్ జంజనం టిడిపిలో చేరే సమయంలో తాము ఎలాంటి హామీ ఇవ్వలేదని తెలిపారు. మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్ సమావేశం యథావిదిగా ఉంటుందని చెప్పారు. అవిశ్వాసం కోరుతూ లేఖపై సంతకాలు చేసిన వారంతా కలిసి తమలో ఒకరిని చైర్మన్ అభ్యర్థిగా నిర్ణయించుకోవాలన్నారు. చైర్మన్ స్థానాన్ని ముగ్గురు మహిళా కౌన్సిలర్లతో కలిపి మొత్తం మొత్తం ఐదుగురు కోరుకుంటున్న నేపథ్యంలో తాను ఎవరి పేరు సూచించేది లేదని, మీరే నిర్ణయించుకుని ఓ పేరు చెప్పాలని ఎమ్మెల్యే తెలిపినట్లు తెలిసింది. తమకు మద్దతుగా చీరాలలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు కోరగా అందుకు ఎమ్మెల్యే అంగీకరిం చినట్లు తెలిసింది. అవిశ్వాసం లేఖపై సంతకాలు పెట్టిన కౌన్సిలర్లు కె.యానాదిరావు, గోలి జగదీష్, గోలి స్వాతి ఈ సమావేశంలో పాల్గొన పోవడం విశేషం. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గానికి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు కూడా సమావేశానికి దూరమయ్యారు.ఎమ్మెల్యే చెప్పిన మేరకు 22 మంది కౌన్సిలర్లు కలిసి ఒకరిని చైర్మన్‌గా ఎంపిక చేయాల్సి ఉంది. అంతా వారు అనుకున్నట్లు జరిగితే ఎమ్మెల్యేతో పాటు , బాపట్ల ఎంపీ కూడా మున్సిపల్ కౌన్సిల్ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణం చేసి ఓటింగ్‌లో పాల్గొంటారు. టిడిపి మద్దతు కౌన్సిలర్ల నుంచి ఒకరిని చైర్మన్‌ను ఎంపిక చేయడం అనేది చాలా ఖరీదైన అంశంగా మారింది. దాదాపు కోటి రూపాయల ప్రాజెక్టుగా మారింది. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

పొగాకు కొనుగోలుకు కంట్రోల్ రూం ఏర్పాటు

- ప్రతిరోజు పొగాకు కొనుగోలు తీరును పర్యవేక్షించనున్న అధికారులు
- నలుగురు అధికారులతో విక్రయాలపై పర్యవేక్షణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బర్లీ పొగాకు రైతుల సమస్యలపై రైతు సంఘాల ఆందోళన, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చేసిన కృషి ఫలించింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పొగాకు సాగు చేసిన రైతులు గత కొంతకాలంగా రైతు సంఘాల నేతృత్వంలో ఆందోళన చేస్తూ వచ్చారు. పొగాకు కంపెనీల వారు పొగాకు కొనుగోలు చేయక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ధర్నాలు, రాస్తారాకోలు చేశారు. జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులను కలసి తమ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్ళారు. పర్చూరు నియోజకవర్గ పర్యటనలో బర్లీ పొగాకు రైతులు సమస్యను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మాత్యులు అచ్చెన్నాయుడు దష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ప్రభుత్వం గత నెల 29న



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు రైతులు, రైతు సంఘాలు, పొగాకు కంపెనీ ప్రతినిధులతో మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ నేపథ్యంలో పొగాకు కొనుగోలుపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ డైరెక్టర్ ఎస్ ఢిల్లీ రావు ఆదేశాలు జారీ చేశారు. బర్లీ టొబాకో కొనుగోలుపై పర్యవేక్షణ విక్రయాల తీరు తెన్నులు ఈ కంట్రోల్ రూమ్ పనిచేయనుంది. దీనిలో పొగాకు, వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులతో మోనిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. గుంటూరు అగ్రికల్చర్ అసి స్టెంట్ డైరెక్టర్ ఎం.రమేష్, అగ్రికల్చర్ మార్కె టింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి జ్యోతి, టొబాకో ఫీల్డ్ ఆఫీసర్ ఎ వంశీకృష్ణ, ఇండియన్ టొబాకో అసోసియేషన్ మెంబర్ ఎన్ శ్రీని వాసరావులతో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో పొగాకు రోజువారీ విక్రయా లను పర్యవేక్షించేందుకు గుంటూరులోని పొగాకు బోర్డులో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బర్లీ-బ్లాక్ టొబాకో కొనుగోలు చేసిన వివిధ పొగాకు కంపెనీల నుండి అధికారుల కమిటీ ప్రతిరోజూ సమాచారాన్ని సేకరించి, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు నివేదికను అందజేయనున్నారు. పొగాకు రైతుల సమస్యను పరిష్కరించేలా ఎమ్మెల్యే ఏలూరి చూపిన చొరవ, రైతుసంఘాల తోడ్పాటు పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఒంటికాలుపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని..
ఒంటి కాలిపై నిల్చొని నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

తమ సమస్యలు పరిష్కరించేవరకూ వెనక్కి తగ్గేదే లేదని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు) తెలిపారు.తమ సమస్యలు గుర్తించి, తమ బిడ్డల భవితకు భరోసా ఇవ్వాలని కోరుతూ ఐదో రోజూ శనివారం కలెక్టరేట్ ఎదుట ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నిబంధనల ప్రకారం రెగ్యులర్ చేయాలని, తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరి ంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నిరసనకు వారి పిల్లలు మద్దతు తెలిపారు. తనను గుర్తించాలని, తన బిడ్డకు భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని కోరుతూ సంతనూతలపాడు మండలం మద్దులూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిహెచ్ఒ, గర్భిణి అయిన అనూష ఫ్లేకార్డుతో వినూత్నంగా నిరసన తెలిపారు. భారతి అనే ఉద్యోగి తన పాప తో కలసి ఆందోళన చేపట్టింది. సిహెచ్ఒల పిల్లలు సైతం సమ్మెలో పాల్గొని అమ్మ ఉద్యోగం - మా భవిష్యత్తు ఎటూ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సీనియారిటీ ప్రకారం ఆరేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల క్రితం రద్దు చేసిన ఇపిఎఫ్ఓను పునరుద్ధరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతనాలలో 23 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఇన్‌సెంటీవ్‌లు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న వారికి రాయితీ ఇవ్వాలన్నారు. పని చేసే చోట్ల భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాజీ, దీప్తి, ప్రసన్న, జీవన జ్యోతి, అనూష తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధమైన సివిల్ జడ్జి కోర్టు భవనం

నేడు సివిల్ జడ్జి కోర్టు భవనానికి ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-శింగరాయషకొండ

శింగరాయకొండలో నూతనంగా నిర్మించిన సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ విభాగం) భవనానికి ఆదివారం ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి నలుగురు హైకోర్టు న్యాయమూర్తులు హాజరు కానున్నారు.భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి శనివారం శింగరాయకొండకు వచ్చి పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె అధికారులు సూచించారు. ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు, శింగరాయకొండ సిఐ సిహెచ్.హజరత్తయ్య, ఎస్ఐ బి.మహేంద్ర ఆధ్వర్యంలో కోర్టు భవన ప్రాంగణాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పరిశీలించారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని కోర్టుల న్యాయ మూర్తులు ప్రారంభోత్స కార్యక్రమానికి హాజరు కానున్నట్లు శింగరాయకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులునాయుడు తెలిపారు. కోర్టు సిబ్బంది, అధికారులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



నవాళులర్పిస్తున్న డిటీ సుధారాణి

విఆర్ఎ మృతి పట్ల సంతాపం

ప్రజాశక్తి - పర్చూరు

మండల పరిధిలోని వీరన్నపాలెం విఆర్ఎగా పనిచేస్తున్న జంగా ప్రభాకర్ శనివారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విఆర్ఎ మృతి చెందారని డిప్యూటీ తహశీల్దారు సుధారాణి తెలిపారు. డిప్యూటీ తహశీల్దారు విఆర్ఎ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. విఆర్ఎ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మట్టి ఖర్చులకు నగదు అందజేశారు. మృతుడు విఆర్ఎకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రత్న కుమారి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన బట్టు రవి కృష్ణ (38) రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన విరాల ప్రకారం మృతుడు పూనూరు నుండి మార్టూరు స్కూటీపై వెళ్ళుతూ దండు దోవ వద్ద స్కూటీ స్కిడ్ అయి పడి ఘటనా స్థలంలోనే చనిపోయాడు. ఎస్ఐ రత్న కుమారి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ అని తెలిపారు. ఘటనా స్థలాన్ని ఆమెతోపాటు పిసి రాములు నాయక్, పోలీస్ సిబ్బంది పరిశీలించారు.



దేవాలయ ఇఒకు చెక్కు అందజేస్తున్న దాతలు

రూ.లక్షల విరాళం అందజేత

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణానికి పట్టణానికి చెందిన ధామ హనుమంతరావు దంపతులు, శంకరాపురం గ్రామానికి చెందిన కూరపాటి ఏడుకొండలు దంపతులు, సింగరకొండపాలెం గ్రామానికి చెందిన స్వారాభి జకరయ్య, చిరంజీవి అభిమాని తోపాటుగా మరికొందరు రూ.లక్షలను సహాయ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడుకు చెక్కు రూపంలో అందించారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయడం వల్ల దేవస్థానం అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. దాతలు ముందు రావాలని కోరారు. రాతి ముఖమండపంతోపాటు ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ఇతర నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 19న మహా కుంభాబి . షేకం జరుగునున్న నేపథ్యంలో భక్తులు స్వామివారి దేవస్థానం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్నారని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై అధికారుల చర్యలు

- అనుమతుల్లేని లేఅవుట్ల రహదారులు తవ్వేసిన అధికారులు
- అనుమతులు తీసుకోకుండా రోడ్లు పూడ్చితే కఠిన చర్యలు
- ప్రజాశక్తి కథనానికి స్పందన



శ్రీలక్ష్మి రియల్ఎస్టేట్ ఎదుట రోడ్డు తవ్వేసిన అధికారులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జాతీయ రహదారి నిర్మాణంతో అక్రమార్కులు యదేచ్ఛగా అక్రమ లేఔట్లను సిద్ధం చేశారు. వీటికి ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేశారు. లేఔట్లపై గత నెల 27న 'పుట్టగొడుగుల వెలుస్తున్న అక్రమ లేఔట్లు' శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురించబడిన కథనానికి బాపట్ల జిల్లా డెవలప్మెంట్ కమిటీ అథారిటీ అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుడా అధికారులు మండలంలో 10 లే ఔట్లకు లోపలికి వెళ్లడానికి వీలు లేకుండా రహదారి మార్గంలో జెసిబిలతో పెద్ద పెద్ద గుంటలు తీయించారు. లే ఔట్ల యజమానులు పంట భూములను నివేశన స్థలాలుగా మార్చుకొనుటకు అవసరమైన భూ మర్పిడి మాత్రమే చేశారని, ఆ భూమిలో సిఆర్డిఎ, భూడా అనుమతితోపాటు పంచాయతీ నుండి కూడా పొందాల్సిన అనుమతి పొందకపోవడంతో అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. నిబంధనల ప్రకారం ఎకరా భూమికి 10 సెంట్లు చొప్పున పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసి నిబంధనల ప్రకారం లే అవుట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. రహదారులు, మురుగు నీటి పారుదల సౌకర్యం, విద్యుత్తు సౌకర్యం వంటి ఏర్పాట్లకు తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంది. జాతీయ రహదారి నిర్మాణంతో పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా నిర్మాణదారులు నిబంధనలు ప్రకారం 10సెంట్లు స్థలాన్ని పంచాయతీకి అప్పగించటానికి రూ.లక్షలు కోల్పోవాల్సి వస్తుందనే దృక్పథంతో ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ లే అవుట్లు సిద్ధం చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు పొందే వరకు తీసిన గుంటలను పూర్చరాదని, ఒకవేళ అక్రమంగా పూడిస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని బుడా అధికారులు హెచ్చరించారు. దీంతో లేఅవుట్ల నిర్మాణ దారులు ఏమి చేయాలో దిక్కుతోచక ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నట్లు తెలిసింది. సిఆర్డిఎ, బుడా అనుమతి పొందిన తరువాత మాత్రమే పంచాయతీ నుండి నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని ఆయా పంచాయతీల కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై తహశీల్దారు మేక శ్రీనివాసరావు మాట్లాడుతూ లేఔట్ల ముందు గుంటలు తీసిన విషయం తమకు తెలియదని అన్నారు. సిఆర్డిఎ, బుడా అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిసిందని అన్నారు. తప్పనిసరిగా అనుమతులు పొందాల్సి ఉందని అన్నారు.



లే అవుట్ల రహదారుల ముందు అధికారులు తీసిన గుంతలు

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలి

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను సమూలంగా రూపుమాపి బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి వాణి అన్నారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ, బాలల హక్కుల అడ్వకసి ఫౌండేషన్, జిల్లా స్థాయి బాలల సంబంధిత ప్రభుత్వ శాఖల సమన్వయంతో పట్టణంలోని ఓ ప్రైవేటు వసతి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. క్రాఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని అన్నారు. పాఠశాలల్లో మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు విద్యా శాఖ అధికారులు కృషి చేయాలని అన్నారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డివి శివప్రసాద్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కార్మిక శాఖ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైతే బాల కార్మికులు పనిచేస్తున్నారో వారిని గుర్తించి, యజమానులపై



మాట్లాడుతున్న జడ్జి జి వాణి

కేసులు నమోదు చేసి, జరిమానాలు విదించడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించవచ్చని అన్నారు. సిఐ రాంబాబు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ, బాల్య వాహాలు, బాలలపై లైంగిక వేధింపుల గురించి ఫిర్యాదు అందిన వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వీటిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో డిఇఒ పి పురుషోత్తం, డిప్యూటీ డిఇఓ సురేష్, సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ బడుగు కిషోర్, సిడిపిఓలు, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, డిసిపి యూనిట్ ప్రతినిధులు, లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ తన్నీరు రత్న కుమారి పేర్కొన్నారు. మండలంలోని నూతలపాడులోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులకు భూసార పరీక్షలపై అవగాహన సదస్సు ఎడిఎ మోహనరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడిఎ రత్నకుమారి మాట్లాడుతూ భూసార పరీక్షల వలన భూమిలో ఏయే పోషకాలు ఉన్నాయో, ఏ పోషకాలు ఎంత మోతాదులో ఉపయోగించుకోవాలో తెలుస్తుందని చెప్పారు. రైతులు తమ భూమిలో నత్రజని, భాశ్వరం, పోటాష్ ఎరువులు ఎంత శాతం ఉన్నాయో తెలుసుకోవచ్చని, రైతులు తమ భూమి చౌడు భూములో, కాదో తెలుసుకోవచ్చని తెలిపారు. సాగు నీరు కూడా పరీక్ష చేయుంచు కోవాలని సూచించారు. ఎడిఎ మోహనరావు మాట్లాడుతూ రైతులు తమ పొలాలను పచ్చి రొట్ట ఎరువులతో సాగు చేసుకుని, సారవంతం చేసుకోవాలని తెలిపారు. పచ్చి రొట్ట ఎరువుల వలన, రసాయనిక ఎరువుల



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొతాదును తగ్గించుకోవచ్చని తెలిపారు. భూసారాన్ని, సేంద్రియ కర్భనశాతం పెంచుకోవచ్చని తెలిపారు. ప్రీ మన్సూన్ డ్రై సోన్ క్రింద ప్రకృతి వ్యవసాయం వారు ఇచ్చే నవధాన్యాలు చల్లుకుని, 45 రోజుల పైరు పెరగనిచ్చి తరువాత భూమిలో కలియ దున్నాలని చెప్పారు. రైతు సోదరలకు పచ్చి రొట్ట విత్తనాలు 50శాతం సబ్సిడీపై ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఓ రామ్మోహనరెడ్డి, ఎఇఓ భాష, మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఎస్పిడి వెన్నెల

సబ్ జైలును పరిశీలించిన జడ్జిలు

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక సబ్ జైలు సీనియర్ సివిల్ జడ్జి ఎస్పిడి వెన్నెల, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ దేవి సాయి శ్రావణి శనివారం సందర్శించారు. ఖైదీలులో ఉండే గదులు, వారికి అందుతున్న భోజన వసతులు, మౌలిక వసతుల గురించి సబ్ జైలు అధికారి వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు సంఖ్య, నేర ప్రవృత్తి గురించి అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలు ఆవరణలో ఉచిత న్యాయవిజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఖైదీలు సత్రృవర్తనతో మెలగాలని క్షణికావేశంలో చేసిన తప్పులను తిరిగి చేయకుండా నేర ప్రవృత్తిలో మార్పు రావాలని ఖైదీలకు సూచించారు. సత్పవర్తన కలిగి ఉంటే మంచిదని సూచించారు. జైలనుండి విడుదలై కుటుంబ సభ్యులతో కలిసి మంచి జీవితాన్ని గడిపేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. తాము బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ జైల్ అధికారి వెంకటేశ్వరరావు, జైలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని 2వ వార్డులో మనస్థాపం చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. సిఐ మల్లికార్జునరావు తెలిపిన మేరకు వివరాల ప్రకారం పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ మండలం జానపాడు గ్రామానికి చెందిన బిళ్ళ నరసింహారావు (30) భార్య సాయి దేవితో కలసి రేపల్లెలోని 2వ వార్డులో అద్దె ఇంటిలో గత 8నెలలుగా నివాసం ఉంటున్నాడు. రేపల్లెలోని పీపుల్స్ కోపరేటివ్ సొసైటి ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజంటుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండు రోజుల క్రితం నరసింహారావు తానూ పనిచేసే ఉద్యోగం మాని మానివేశాడు. ఉద్యోగం విషయంపై భార్య భర్తలు ఇద్దరు గొడవ పడి అంతట మనస్తాపం చెంది రాత్రి సమయంలో ఇంటిలోని ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతునికి పిల్లలు లేరు. మృతుని తండ్రి బిళ్ళ కోటేశ్వరరావు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

నిర్లక్ష్యం ఖరీదు.. నిండు ప్రాణం..

- అప్పుడు శ్యామేల్, ఇప్పుడు సునీల్
- కరెంటు పని చేస్తూ వ్యక్తి మృతి
- పేరాల జక్కావారి వీధిలో ఘటన
- మృతుడు విజయనగర కాలనీ వాసి


విద్యుత్ తీగలపై వేలాడుతున్న ప్రవేటు లైన్‌మెన్ సునీల్ (29)

ప్రజాశక్తి - చీరాల

విద్యుత్ అధికారులు.. కాంట్రాక్టు పని నిర్వాహకులు.. లోపం ఎవరిదైనా సరే.. వీరు ఇరువురి నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. అప్పట్లో శ్యామేల్, ఇపుడు జడా సునీల్ (29) చనిపోయిన ఇద్దరు విజయనగర కాలనీ వాసులే. విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద కూలి పని చేస్తున్నారు. రెండు ఘటనలో ఒక్కటే కారణంతో చనిపోయారు. వివరాల్లోకి వెళితే... కరెంటు కాంట్రాక్టర్ వద్ద లైన్‌మెన్‌గా పని చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన పేరాల జక్కావారి వీధిలో శనివారం జరిగింది. మండలంలోని విజయనగర కాలనీకి చెందిన జడ బాబురావు, కెజియ దంపతుల పెద్ద కుమారుడు జడ సునీల్ అనే వ్యక్తి ఐక్యనగర్‌కు చెందిన జోషి అనే ప్రయివేట్ కాంట్రాక్టర్ వద్ద కరెంటు పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం యధావిధిగా పనికి వెళ్లిన సునీల్ కరెంటు స్తంభం ఎక్కి ఎల్‌టికు సంబంధించిన పనిచేస్తున్నాడు. అదే సమయంలో మరో చోట 33కెవి పని కూడా చేస్తున్నారు. అంటే ఏకకాలంలో రెండు పనులు జరుగుతన్నాయి. ఈ నేపథ్యంలో లైన్‌మెన్ అరగంట సమయం వరకు విద్యుత్ రాదని ఎల్‌సి ఇచ్చామని చెప్పటంతో సునీల్ ఆ ప్రక్కనే పలు ఇళ్లలో వారిని కరెంట్ ఉందాని అడిగి తెలుసుకొని కరెంట్ లేదనుకున్నకే కరెంట్ పని చేస్తున్నాడు. అయితే 33కెవి లైన్ పని ముగియటంతో అక్కడ సిబ్బంది లైన్ ఆన్ చేశారని, దీంతో సునీల్ పని చేస్తున్న ఎల్‌టికి విద్యుత్ రావటంతో ఒక్క సారిగా కరెంట్ షాక్ తగిలి అక్కడే కుప్ప కూలి కరెంట్ తీగలపై వేలాడాడు. వెంటనే అప్రమత్తమైన తోటి సిబ్బంది క్రిందకి దింపి ప్రథమ చికిత్స అందించే లోపు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబానికి ఆదరువుగా ఉన్న కుమారుడు కళ్ళ ముందు జీవచ్ఛవంలా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు తిల్ల, డిల్లి పోతున్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోని, న్యాయం చేయాలని కాలనీ పెద్దలు కోరుతున్నారు.


సునీల్ (ఫైల్ ఫోటో)

గతంలోనూ ఇదే తరహా మృతి

గతంలో కూడా విజయనగర్ కాలనీకి చెందిన సామ్యూల్ అనే యువకుడు ఇదే తరహాలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కరెంట్ తీగలపై వేలాడుతూ మృతి చెందాడు. కాంట్రాక్టర్లు పోల్స్‌పై ప్రైవేట్ లైన్ మెన్ పనిచేసే సమయంలో ఏర్పాటు చేయాల్సిన కనీస వసతులు, జాగ్రత్తలు పట్టించుకోకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగు తున్నాయని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. లైన్మెన్‌లకు సంబంధించి కాంట్రాక్టర్లు భీమా చేయించాల్సి ఉంది. ఎంత మంది కాంట్రాక్టర్లు పనికి తీసుకెళ్లే లైన్మెన్‌కు భీమా చేయిస్తున్నారు? పనులు చేయించుకొని చేతులు దులిపేసుకుంటున్నారా? మృతి చెందిన కుటుంబాలకు భరోసా ఇస్తారా? వీరి వివరాలు లేబర్ ఆఫీసు వద్ద ఉంటాయా? అనేది సంబందిత అధికారులే పరిశీలించాల్సి ఉంది.

పట్టాలు ఇచ్చారు... స్థలం ఎప్పుడు చూపిస్తారో?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత వైసిపి ప్రభుత్వం పాలనలో నిరుపేదలకు కేటాయించిన నివేశన స్థలాలతోపాటు భట్టిప్రోలులో రెండెకరాల భూమిని నిరుపేదలైన ఓసి సామాజిక వర్గాలకు కేటాయించింది. ఈ భూమిని సాగు చేసే కౌలు దారుడు ఎన్నో ఏళ్లుగా ఈ పొలాన్ని సాగు చేసుకుంటున్నానని, యజమానులు తనకు అమ్ముతామని చెప్పి అమ్మకుండా నివేశన స్థలాలకు కేటాయించటం సరైనది కాదని కోర్టును ఆశ్రయించాడు. దీంతో ఈ భూమి కోర్టు పరిధిలోకి వెళ్లిందని, దీనిలో పట్టాలు కేటాయించిన 107 మంది ఓసి లబ్ధిదారులకు కోర్టు నుండి తీర్పు వచ్చిన అనంతరం పట్టాలకు భూమిని చూపించగలమని అధికారులు చెప్పుకుంటూ వస్తున్నారు. ఇది జరిగి ఐదేళ్లు అవుతున్నప్పటికీ కోర్టులో ఉన్న ఈ సమస్య అధిగమించేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. దీనికి సంబంధించిన తగిన వివరాలతో ప్రభుత్వపరంగా రెవెన


కోర్టులో వివాదంలో ఉన్న జగనన్న కాలనీ నివేసిన స్థలాలు

అధికారులు కోర్టు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తే తమకు నివేశన స్థలాలు దక్కుతాయని, ఆ మేరకు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పేరుకే ఓసి సామాజిక వర్గం అయినప్పటికీ అనేక మందికి నివేశన స్థలాలు లేక అద్దె ఇళ్లలో ఉంటూ కాలం వెళ్లదీస్తున్నామని, ఎప్పటికప్పుడు ఈ ఏడాదైనా కోర్టు సమస్య పరిష్కారం అవుతుందని, స్థలం చేతికి అద్దుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అనప్పటికీ లబ్ధిదారుల ఆశ నిరాశ గానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓసిలకు కేటాయించిన స్థల సమస్య కోర్టుకు వెళ్లకముందే అప్పటి అధికారులు, వైసీపీ నాయకులు పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ ఎవరికి వారు పట్టించుకోకపోవడంతో కోర్టు దాకా వెళ్లి దీర్ఘకాలంగా సమస్య కొనసాగే పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. స్థలం చేతికి దక్కకపోయినా అధికారులు ఇచ్చిన నివేశన స్థలాల పట్టాలు చూసుకుంటూ ఎదురు చూస్తున్నామని, లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి తగిన ఆధారాలు కోర్టుకు చూపించి కోర్టులో వివాదం పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరుచున్నారు. ఇచ్చిన పట్టాలకు స్థలం చూపాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దారు ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ నివేసిన స్థలాల సమస్య కోర్టు పరిధిలో ఉందని కోర్టు తీర్పు వచ్చే వరకు తాము ఏమీ చేయలేమని చెప్పారు.

జూలై5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రేపల్లె


మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎస్‌పిడి వెన్నెల

రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఇచ్చిన ఆదేశాల మేరకు జూలై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ పడదగిన కేసులను సత్వరం పరిష్కరించే విధంగా పోలీసు అధికారులు సహకరించాలని నూతన జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పిడి వెన్నెల అన్నారు. స్థానిక కోర్టు హాల్లో రేపల్లె సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రిమినల్, సివిల్, ఎడ్యుకేషన్ వంటి కేసులతోపాటు బ్యాంకు లావాదేవీ,లు భార్యా భర్తల మధ్య వివాదాలు, బిఎస్‌ఎన్‌ఎల్, జాతీయ బ్యాంకుల్లో పెండింగ్లో ఉన్న పరిష్కారం కానీ రాజీ పడదగిన కేసులను పరిష్కరించే విధంగా అధికారులు చొరవ చూపి సహకరించాలని అన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి దేవి సాయి శ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గీతా భార్గవి, డిఎస్పి ఎ శ్రీనివాసరావు, సిఐ మల్లికార్జునరావు, రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిప్రోలు, అడవులదీవి, సోడాయిపాలెం ఎస్‌ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గిరిధర్, కార్యదర్శి శ్రీనివాసరావు, పలు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పాంచాడవరం రహదారి పట్ల చిన్నచూపా?

ప్రజాశక్తి - అమృతలూరు

కూటమి ప్రభుత్వ పాలనలో యుద్ధ ప్రాతిపదికన అనేక రహదారులు అభివృద్ధి చేసి సమస్యలు తీర్చారు. కానీ గూడవల్లి నుండి అమృతలూరు వెళ్లడానికి అత్యంత దగ్గర మార్గంగా ఉన్న పాంచాలవరం రహదారిని మాత్రం అధికారులు చిన్న చూపు చూస్తున్నారని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. గూడవల్లి నుండి ఇటు అమృతలూరు రహదారి అభివృద్ధికి అధికారులు పనులు ప్రారంభించి కొంతమేర పూర్తి చేశారు. కానీ అత్యంత ప్రాధాన్యత కలిగి అధ్వానంగా ఉన్న పాంచాలవరం నుండి గూడవల్లి వెళ్లే రహదారిలో గంగోలు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారిని మాత్రం వదిలేశారు. గూడవల్లి నుండి పాంచాలవరం, గంగోలు ప్రాంతం వరకు నిర్మించిన ప్యాచ్ వర్క్‌లు నాణ్యత లోపంగా ఉండటమే కాక కొద్దిపాటి గుంటలను సైతం పూడ్చకుండా వదిలేయడంతో అవి ప్రస్తుతం పెద్దగుంటలుగా మారి చేసిన పని కనిపించని పరిస్థితి నెలకొని పూర్వస్థితికి వచ్చింది. గంగోలు కాలువ నుండి పాంచాలవరం వరకు రహదారి ప్రస్తుతం పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు సైతం ప్రయాణించే పరిస్థితి లేకపోగా గుంటల్లో పడి వాహనాలు ఎక్కడ దెబ్బతింటాయో, ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో గోవాడ నుండి పాంచాలవరం గ్రామస్తులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఈ రహదారిపైనే ప్రయాణించాల్సి ఉంది. వ్యవసాయ ఉత్పత్తులు ఈ రహదారిపై తరలించుకునేందుకు గుంటల కారణంగా ట్రాక్టర్లు ఇతర వాహనాలు వ్యవసాయ ఉత్పత్తులు తరలించే సమయంలో గుంటలో పడి దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాలను కలిపే అత్యంత ప్రాధాన్యత కలిగిన దగ్గర మార్గంగా ఉన్న ఈ రహదారిని అధికారులు పరిశీలించి ప్రజల ఇబ్బందుల దృష్ట్యా అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


గుతలు పడ్డ గూడవల్లి, పాంచాలవరం రహదారి


సమ్మె నోటీసును అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు

ఐటిసి యాజమాన్యంకు సమ్మె నోటీసు

ప్రజాశక్తి - చీరాల

ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్టిడి కంపెనీ వర్కర్స్ (సిఐటియు) చీరాల బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఐటీసీ పర్సనల్ మేనేజర్ రామకృష్ణకు ఈనెల 20వ జరగనున్న సమ్మె నోటీసు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి సుధాకర్ మాట్లాడుతూ మే 20న లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్త జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కంపెనీ యాజమాన్యంకు లెటర్ ఇచ్చినట్లు తెలిపారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలన్నీ నీరుగారి పోతాయని అన్నారు. కార్మికులు బానిసత్వంలోకి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. పనిగంటలు పెంచుతారని అన్నారు. సమ్మె హక్కు ఉండదని, యాజమాన్లకు అనుకూలంగా మార్చిన చట్టాలను రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ గౌరవాధ్యక్షుడు ఎం వసంతరావు, బ్రాంచి అధ్యక్షుడు బోయిన పోతురాజు, కార్యదర్శి జి సుధీర్, రాష్ట్ర కోశాధికారి పఠాన్ కాలీషా, సిహెచ్ భాస్కర్, పి తిరుమలరావు, కొండ్రు ఎలీషా, చింతా శ్రీనివాసరావు, ఎం సత్యమూర్తి పాల్గొన్నారు.


బీసీ సంఘ నాయకులను అభినందిస్తున్న దృశ్యం

బీసీ సంఘ అధ్యక్షుడిగా 'కందుకూరి'


ప్రజాశక్తి - పంగులూరు

బీసీ సంక్షేమ సంఘం మండల నూతన అధ్యక్షునిగా కందుకూరి మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. స్థానికంగా శనివారం జరిగిన బీసీల సమావేశంలో ఆయనకు నియోజకవర్గ అధ్యక్షుడు రవిచంద్ర నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలు పర్యటించి బీసీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. తనకు అధ్యక్ష పదవి రావడానికి సహకరించిన బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన్న శంకరరావు, జిల్లా అధ్యక్షులు బాపట్ల రవికుమార్, నియోజకవర్గ అధ్యక్షులు రవిచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో బిసిల సమస్యలు తెలుకుని పరిష్కారానికి కృషి చేస్తనని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు రావూరి శ్రీనివాసరావు, పీరు సాహెబ్, సాంబశివరావు, చంటి, కొత్త నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ఎల్ఐసి పీరు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం మోదుకూరు, చుండూరు గ్రామాల వద్ద రైల్వే ట్రాక్‌పై నిర్మించనున్న ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులను బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, శాసన సభ్యులు నక్కా ఆనందబాబు పరిశీలించనున్నట్లు ఆనందబాబు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 9:30 గంటలకు చుండూరు రైల్వే స్టేషన్ సమీపంలోనూ, 10:30కు మోదుకూరు రైల్వే గేటు వద్ద జరిగే పనులు పరిశీలించనున్నట్లు చెప్పారు. వంతెన నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. త్వరిత గతిన నిర్మాణం పూర్తి చేయించేందుకే పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపి కృష్ణ ప్రసాద్ ఈ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయించారని, వీటితో నిర్మాణ పనులు చేపట్టేందుకు పరిశీలించనున్న దృష్ట్యా నియోజకవర్గంలోని కూటమి నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

5 నుంచి చిల్డ్రన్ సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ప్రకాశం బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి చిల్డ్రన్ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కమిటీ తెలిపింది. స్థానిక ఎల్‌బిజి భవనంలో కమిటీ నాయకులు సిహెచ్.వినోద్, వీరాస్వామి ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి ఇంద్రజ్యోతి, మ్యాజిక్ రామన్, జన విజ్ఞాన వేదిక నగర కార్యదర్శి రంగారెడ్డి క్యాంప్ కరపత్రాలు, వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడేళ్లుగా చిల్డ్రన్ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు టివి,సెల్ ఫోన్ లాంటి మాధ్యమాలకు ఆకర్షితులై వాటికి బానిసలు కాకుండా వారిలోని సజనాత్మకతను వెలికి తీయడానికి ఈ క్యాంపు ఉపయోగ పడుతు ందన్నారు. సైన్స్ ప్రయోగాలు, క్రాఫ్టింగ్, ఫన్ని మ్యాథ్స్, సెల్ఫ్ డిఫెన్స్, మెమరీ గేమ్స్, మ్యాజిక్, పాటలు, ఆటలు, కథలు నేర్పించడంతో పాటు మహనీయుల జీవితాల గురించి వివరించడం ద్వారా దేశభక్తి అలవర్చేందుకు దోహద పడుతుందన్నారు. 4వ తరగతి నుంచి 10వ తరగతి లోపు విద్యార్థులు మాత్రమే ఈ క్యాంపులో పాల్గొనాలని తెలిపారు. క్యాంపు రిజిస్ట్రేషన్ కోసం 9490300412, 9290039482 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి

కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

కార్మికుల హక్కులను హరించివేసే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, 8 గంటల పని విధానం అమలు కొనసాగాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టాడన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మె, హర్తాల్‌ను జయప్రదం చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఉద్యోగ, కేంద్ర, కార్మిక సంఘాలు ,రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం మూడో సారి అధికారం చేపట్టిన తర్వాత కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చేలా లేబర్ కోడ్స్ అమలు చేసే ప్రయత్నాలను తీవ్రతరం చేసిందని దుయ్యబట్టారు. ఫలితంగా కార్మికులు కనీసం సంఘాలు (యూనియన్) ఏర్పాటు చేసుకునే హక్కులు కోల్పో యారన్నారు. సమ్మె హక్కును కోల్పోవడం, బేరసారాలతో శక్తిని నిర్వీర్యం చేయడమే కాకుండా సమ్మెను చట్టవిరుద్ధంగా ప్రకటించి జరిమానాలు, శిక్షలు విధించేలా కార్పొరేట్లకు అనుకూలంగా లేబర్ కోడ్స్ రూపొందించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అత్యంత కారుచౌకగా కార్పోరేట్లకు (అనుయాయులకు) ధారాదత్తం చేస్తుందన్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును సైతం మోడీ ప్రభుత్వం ఖాతర్ చేయకుండా కోర్టుతీర్పు ఉల్లంఘనకు పాల్పడటం అత్యంత దుర్మార్గమన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు కనీస ఉద్యోగ భద్రత కూడా లేదన్నారు.గత పది సంవత్సరాలుగా కేంద్రప్రభుత్వం స్కీం వర్కర్ల వేతనాలు పెంచలేదన్నారు.ప్రభుత్వ విధానాల ఫలితంగా గ్రానైట్, డిజైన్ స్లేట్, ఆక్వా రంగాలు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయాయన్నారు. కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేసారు. అసంఘటితరంగ కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. నూతన రవాణా చట్టంతో రవాణా రంగం కుదేలవుతుందని ఆరోపించారు.ఒడిచముర ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లను పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారు.ఉపాధి హామీ చట్టం నిధుల్లో కోతపెట్టి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా వ్యవ సాయరంగం సంక్షోభంలో కూరుకుపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ఉద్యోగ, శ్రామిక,రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మె, హర్తాళ్‌ను సంపూర్ణంగా జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, ఐయఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మోహన్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, ఎపి కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, ఎపి రైతు సంఘం జిల్లానాయకుడు టి. శ్రీకాంత్,ఎఐయఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎంఎస్.సాయి, ఐయన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణం పూర్తి చేయాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

వాడరేవు-నకిరేకల్లు, బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. వాడరేవు-నకిరికల్లు జాతీయ రహదారి 167-ఎ నిర్మాణంలో కారంచేడు, పర్చూరు, వేటపాలెం, చీరాల మండలాలలో భూ సేకరణ సమస్యలు పరిష్కరించాలన్నారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారందరికీ న్యాయబద్ధంగా నగదు చెల్లింపులు జరగాలన్నారు. చీరాల మండలంలోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో నివాసముంటున్న 63 గహాల నిర్మాణాలను తక్షణమే తొలగించాలన్నారు. చట్టబద్ధంగా వారికి రావలసిన పరిహారం అందించాలన్నారు. బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి 544-జి నిర్మాణానికి ఆటంకంగా ఉన్న భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. జె.పంగులూరు మండలంలో ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తక్షణమే సమస్యను పరిష్కరించాలన్నారు. అద్దంకిలో ఆక్రమణలు తొలగించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కారణాల చేత నష్టపరిహారం నగదు చెల్లింపులు నిలిచిపోయిన వారికి తక్షణమే అందించాలన్నారు. రహదారుల నిర్మాణంలో జాప్యం ఉండరాదని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. రెవెన్యూ సమస్యలన్నీ మూడు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. 16వ నంబర్ జాతీయ రహదారి నిర్మాణాలో భాగంగా పిచ్చుకల గుడిపాడు వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం అర్ధహెక్టార్ భూసేకరణ త్వరగా చేపట్టాలన్నారు. సమీపంలోని మరో భూమి సమస్య తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌డిసి లవన్న, బాపట్ల, చీరాల ఆర్‌డిఒలు పి. గ్లోరియా, చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగం పర్యవేక్షకులు సంధ్యారాణి, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఇళ్ల నిర్మాణాల పురోగతిలో ప్రతివారం స్పష్టమైన పురోగతి ఉండాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. గహ నిర్మాణాలపై ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని నియోజకవర్గాలలో కేటగిరిల వారిగా ఇళ్ల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, పివిజిటి చెంచులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం చేస్తుండటంతో ఆ డబ్బులను ఇళ్ళ నిర్మాణాలకి లబ్దిదారులు ఖర్చు పెట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పిఎం జన్ మన్ పథకంలో చేపట్టిన ఇళ్ళ నిర్మాణ పురోగతిపై ప్రధానమంత్రి కార్యాలయం నుంచి పర్య వేక్షిస్తుండటంతో వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎంపిడిఒలు, హౌసింగ్ ఎఇలు సమన్వయంతో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. వచ్చే సమావేశం నుంచి గ్రామాల వారీగా ఇళ్ళ నిర్మాణాల పురోగతి పై సమీక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆ దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్, ఇఇలు, డిఇఇలు, ఎఇలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కోలాహలంగా మేడే..



ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేని కార్మికులంతా కోలాహలంగా జరుపు కున్నారు. మేడే వేడుకల్లో భాగంగా ఎర్రజెండాలు రెపరెపలాడాయి. కార్మికులు గులాములు చల్లుకుంటూ ర్యాలీలు నిర్వహించారు. మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకు కంకణబద్ధులు కావాలని కార్మికసంఘాల నేతలు పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు ఐక్యమై అనేక హక్కుల్ని సాధించుకున్న పరిస్థితుల నుంచి నేడు కొన్ని మతతత్వ శక్తుల కారణంగా క్రమేపి ఆ హక్కుల్ని కోల్పోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని, ఎనిమిది గంటల పని దినం లేకుండా పోయే పరిస్థితి ఏర్పడు తున్నాయని కార్మికులను హెచ్చరిం చారు. పెటు బడిదారులు, పాలకులు వారానికి 80 నుంచి 90 గంటలు పని చేయండనే పరిస్థితి ఏర్పడ నుందన్నారు. కనీస వేతనం పిఎఫ్, కార్మికుల భద్రత,పెన్షన్, సామాజిక భద్రత వంటివి కార్మికులు కోల్పోనున్న పరిస్థితి ఎదురు కానుందన్నారు. లేబర్ కోర్టులు 43 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్పులుచేసి సంఘాలు పెట్టుకోవడానికి, సమ్మె చేయడానికి, ఆందోళన చేయటానికి అవకాశం లేకుండా చేయనున్నారని తెలిపారు. కార్మిక హక్కుల్ని కాలరాస్తున్నారని, కనీస సౌకర్యాలు కోల్పోయే పరిస్థితి ఎదురు కానుందన్నారు.

అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతమైంది. బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు, నేతలతో పాటు దాదాపు 22 వేల మంది తరలి వెళ్లి ప్రధాని సభలో పాల్గొన్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం శ్రమించింది. సభలో పాల్గొనేందుకు వెళ్లిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. రాజధాని సమీప జిల్లా బాపట్ల ప్రాంతం అమరావతి పునర్నిర్మాణంతో మరింతగా అభివృద్ధికి నోచుకుంటుందన్న ఆశతో ప్రజలు ఉన్నారు.ప్రధానంగా భవన నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ రంగం మరింతగా వేగం పుంజుకుంటుందని భావిస్తున్నారు.

లోన్ యాప్‌ల భారీన పడి అప్పుల పాలై వాటి నుంచి బయట పడేందుకు దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసు కుంటున్నాయి. కొద్ది పాటి ఆదాయంతో కుటుంబ జీవనం కష్టమై కొందరు రుణాలు తీసుకుంటున్నారు. వాటి తీర్చేందుకు ఈజీ మనీ కోసం ఆశపడి మరింతగా నష్టపోతున్నారు. కష్టాల నుంచి బయటపడేందుకు దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కి కటకటాలపాలవుతున్నారు. చీరాల పట్టణంలో ఇలాంటి ఘటనే వెలుగు చూసింది.లోన్ యాప్‌ల భారీన పడిన ఇద్దరు యువకులు తాము చేస్తున్న కరెంట్ పని, చేతి వృత్తి ద్వారా వస్తున్న ఆదాయం చాలక అప్పుల నుంచి బయటపడేందుకు తాము పని చేసిన ఇంటిలోనే దొంగతనం చేసి పోలీసులకు చిక్కారు. 125 సవర్ల బంగారం, రూ. 1.50 లక్షల నగదు చోరీ చేశారు. యువకులు గంటల వ్యవధి లోనే పోలీసులకు చిక్కారు.

ఈ ఏడాది రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభించడం లేదు. రాష్ట ప్రభుత్వం కొంత మేర ధాన్యం కొనుగోళ్ళు జరిపింది. పొగాకు,అపరాలు తదితరాలకు తగిన ధర కల్పించలేక పోవడంతో రైతులు రోడ్డు ఎక్కారు. నల్లబర్లీ పొగాకుకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. పొగాకుకు గిట్టుబాటు ధరకల్పించి కొనుగోలు చేయకపోతే సిఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పొగాకు కంపెనీలు రైతుల వద్ద ఉన్న పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం కంపెనీలపై ఒత్తిడి తీసుకొని రావాలని కోరారు. నల్లబర్లీ పొగాకును టుబాకో బోర్డు పరిధిలోకి తీసుకొని రావాలన్నారు. విదేశాల్లో నల్లబర్లీ పొగాకుకు గిరాకీ ఉందని, ప్రతి సంవత్సరం వేల కోట్లల్లో అధిక ఆదాయాలు పొందుతున్న ఐటిసి, దక్కన్, జిపిఎ, రిలయన్స్, మహాలక్ష్మి, బొమ్మిడాల తదితర కంపెనీలు వెంటనే పొగాకును కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా